క్లుప్తంగా

27న సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు మండల పరిషత్ సూపరిటెండెంట్ క్రాంతికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కృపేశ్ అధ్యక్షత మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు నిర్ణీత సమయం లోపు హాజరుకావాలన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



చౌదర్‌పల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిని రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. వ్యసాయాధికారులు చౌదర్‌పల్లి, ఇస్రాయిపల్లి, కోరింతకుంటతండా, వెంకటాపూర్, ఆర్లకుంటతండా, వెంకట్రావ్‌పేట్,తదితర గ్రామాల్లో ఆదివారం ఏఓ రాజు ఆధ్వర్యంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. 10 ఎకరాల్లో మొక్కజొన్న, రెండెకరాల్లో కీరదోశ పంటలకు నష్టం జరిగిందని, దెబ్బతిన్న పంటల నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఏఓ చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు నిఖిత, శ్రీనాథ్, శ్రీకాంత్, విజయ్, శిరిష, సర్పంచ్ చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పుల్సింగ్ తండాకు చెందిన అరుణ్ కుమార్‌కు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.32,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు వెల్జాల్‌లో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ముజీబుర్ రహ్మాన్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, శేఖర్, జంగయ్యగౌడ్, శ్యామ్‌సుందర్ రెడ్డి, గణేష్, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఫరీద్



ఫరీద్‌కు నియామకపత్రం అందిస్తున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎండీ.ఫరీద్‌ను నియమించారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫరీద్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాములు, మానయ్య, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

కడ్తాల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాలకు కుటుంబ సభ్యులతో కలిసివెళ్లారు. తమతమ వ్యవసాయ పొలాల్లో ప్రత్యేకమైన వంటకాలను తయారుచేసి కులదేవతలకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆడిపాడి సంతోషంగా గడిపారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

ఇళ్ల నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన కాలే యాదయ్య ఆర్థికంగా వెనుబడి ఉన్నారు. ఆతను ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక ఇంటి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపి వేశాడు. స్థానిక నాయకుడు ప్రదీప్‌రెడ్డి సహకారంతో జడ్పీటీసీ ఉప్పల వెంటేశ్‌ను కలిసి ఆర్థికసహాయం చేయాలని కోరారు. స్పందించిన జెడ్పీటీసీ.. ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులతో ఆదివారం ఇసుక, ఇటుక, స్టీల్, సిమెంట్ తదితర ఇంటి నిర్మాణానికి అయ్యే మెటీరియల్‌ను యాదయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ప్రదీపురెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

వనస్థలిపురం: బస్ షెల్టర్ నిర్మాణానికి దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం తూర్పు ఫేజ్-1 కాలనీలో సాగర్ రహదారిపై దాత రామాంజనేయులు సహకారంతో నూతనంగా బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఆ బస్ షెల్టర్‌ను ఆదివారం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు అనిల్, వేములయ్య, లత, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిధులున్నా.. మరమ్మతులు పట్టవా?



చౌదరిపల్లి-చింతుల్ల మధ్య రోడ్డు దుస్థితి



యాచారం- మొండిగౌరెల్లి రోడ్డులో ఇలా..

- మరమ్మతులకు నోచుకోని యాచారం గ్రామీణ రోడ్లు
- ఏడాది క్రితమే రూ.2.55 కోట్ల నిధుల మంజూరు
- గుంతలు, కంకర తేలిన రహదారులపై ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

యాచారం: గ్రామీణ ప్రాంత రోడ్ల మరమ్మతుల పనులకు గ్రహణం పట్టింది. ఏడాది కిందే నిధులు మంజూరైనా మరమ్మతుల పనులు ప్రారంభించే విషయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు శ్రద్ధ లేకుండా పోయింది. ఏళ్ల కింద నిర్మించిన రోడ్లు ప్రస్తుతం గుంతలు పడి, కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్ల మరమ్మతుల పనులు ప్రారంభించాలని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. వివారాల్లోకి వెళ్తే.. ఏడాది కిందనే యాచారం మండల పరిధిలోని 6 రోడ్ల మరమ్మతులకు గాను రూ.2కోట్ల55 లక్షల నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రం నుంచి చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, నక్కర్తమేడిపల్లి, సాగర్‌రోడ్డు నుంచి చింతపట్ల, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, మాల్ కేంద్రం నుంచి నల్లవెల్లి, నల్లవెల్లి తండాలకు రోడ్డు మార్గాలు ఉన్నాయి. పదేళ్ల కిందట ఈ మార్గాల్లో పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్లను నిర్మించారు. మొదట బీటీ రోడ్లు నిర్మించే సమయంలో 3 నుంచి 5 ఏళ్ల పాటు ఆ కాంట్రాక్టరే ఏడాదికి, రెండేళ్లకోమారు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ మరమ్మతుల పనులు ప్రారంభించే విషయంలో కాంట్రాక్టర్లు అలసత్వం పాటించడం ప్రయాణికులకు పెద్ద శాపంగా మారింది. కంకర తేలిన రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారుల గుంగా వెళ్లాలంటేనే జంకే పరిస్థితి ఉంది. మంజూరైన నిధుల ద్వారా ఇప్పటికైన రోడ్డు మరమ్మతుల చేపట్టి ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్ల వివరాలు

- చింతుల్ల-చౌదర్‌పల్లి (రూ.85 లక్షలు)
- బీటీ రోడ్డు పెద్దతుల్ల-చింతుల్ల (రూ.40 లక్షలు)
- యాచారం నుంచి మల్కీజ్‌గూడ మీదుగా నక్కర్తమేడిపల్లి (రూ.20 లక్షలు)
- యాచారం-మొండిగౌరెల్లి (రూ.30లక్షలు)
- సాగర్‌రోడ్డు-చింతపట్ల (రూ.40 లక్షలు)
- మాల్-నల్లవెల్లి (రూ.40 లక్షలు)

మరమ్మతులు చేపట్టాలి



యాచారం మండల కేంద్రం నుంచి మొండిగౌరెల్లి, సాగర్‌రోడ్డు నుంచి చింతపట్ల గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఏడాది కిందటే రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు మరమ్మతు పనులు చేపట్టలేదు. ఏళ్ల కింద నిర్మించిన రోడ్లు గుంతలుగా మారి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో ఇబ్బందిగా ఉంది. వెంటనే రోడ్లకు మరమ్మతు పనులు ప్రారంభించాలి.

– తాండ్ర లక్ష్మమ్మ, ఎంపీటీసీ, చింతపట్ల

త్వరలో పనులు ప్రారంభిస్తాం



యాచారం మండల పరిధిలోని ఆరు రోడ్ల మరమ్మతులకు గాను ఏడాది కిందనే రూ.2 కోట్ల 55లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతోనే జాప్యం జరిగింది. కొద్ది రోజుల కింద యాచారం నుంచి మల్కీజ్‌గూడ గ్రామం వెళ్లే దారిలో సీసీ రోడ్లు, కల్వర్టు పనులు పూర్తిచేశాం. పక్షం రోజుల్లో అన్ని రోడ్లకు సంబంధించి పనులు ప్రారంభించేలా చూస్తాం.

– ఉస్మాన్, పంచాయతీ రాజ్ ఏఈ, యాచారం

బాధితులకు బియ్యం పంపిణీ



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు

యాచారం: వడగళ్ల వర్షం కురిసి నష్టపోయిన మంతన్‌గౌరెల్లి గ్రామస్తులకు రెవెన్యూ అధికారులు ఆదివారం ఇంటికి పదికిలోల చొప్పున ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. వడగళ్ల వర్షంతో గ్రామంలోని 500 ఇళ్ల వరకు రేకుల ఇళ్లు ధ్వంసమై రంధ్రాలు పడి ఇంట్లో ఉన్న వస్తువులు, బియ్యం, సరుకులు ఇతర విలువైన వస్తువులు తడిసిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తక్షణ సహాయం కింద ఇంటికి పది కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారు. నష్టపోయిన బాధితుల వివరాలు నమోదు చేసిన అధికారులు ఏ విధంగా బాధితులకు పరిహారం చెల్లించాలనే విషయమై ఆలోచన చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ సూచన మేరకు న్యాయమైన పరిహారం అందించేలా తహసీల్దార్ సుచరిత నివేదికను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటాచారికి పంపించారు.

గ్రామాలకు ఆధ్యాత్మిక శోభ



యాచారం: రథోత్సవంలో భక్తులు

యాచారం: మండల కేంద్రంలోని తిరుమలేశుని గుట్టపై వెలిసిన స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామిశ్రీ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం కల్యాణోత్సవం నిర్వహించగా.. ఆదివారం రథోత్సవాన్ని నిర్వహించారు. పూజారి హరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాలు..

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో ఆదివారం బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూజారులు వెంకటసుబ్బయ్యశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, స్వస్తివాచనం, మండపారాధన, హోమం, బొడ్రాయికి అభిషేకం, అలంకారం నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి మహిళలు బోనాలు సమర్పించారు. సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ కిషన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తుర్కగూడలో రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో మండలంలోని గ్రామల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎంపీపీ కృపేశ్ తెలిపారు. ఆదివారం తుర్కగూడ గ్రామంలో రూ.25 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, సర్పంచ్ పవిత్రకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎన్నోయేండ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోతున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో రూ.1.5 లక్షలతో నిర్మిస్తున్న వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్ పనులను ఎంపీపీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి, ఉపసర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, మునీర్, వార్డు సభ్యులు రాజేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనే ప్రభుత్వ లక్ష్యం

బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు



పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కృష్ణమోహన్‌రావు

హయత్‌నగర్: ఆదర్శ దంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే జీవితాలు ప్రపంచానికే ఆదర్శమని, పూలే ఆదర్శాల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. హయత్‌నగర్‌లో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ జరిగింది. అందులో భాగంగా ఆదివారం వారి విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వకుళాభరణం మాట్లాడుతూ... స్వాతంత్ర్యానికి పూర్వమే కుల మతాలకు అతీతంగా అందరికీ విద్య అందాలనే మహోన్నతాశయంతో పాఠశాలలు నెలకొల్పిన గొప్ప సంఘ సంస్కర్తలు పూలే దంపతులు అని కొనియాడారు. బీసీ సంఘం జాతీయ నాయకుడు దుండ్ర కుమార్‌స్వామి మాట్లాడుతూ... కుల వివక్షత, నిరక్షరాస్యత ఉన్న రోజుల్లో పూలే దంపతుల సమాజానికి చేసిన సేవ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. నాయకులు ఈశ్వరమ్మ యాదవ్. శ్రీనివాస్‌యాదవ్, కదారి యాదగిరి, బాబా యాదవ్, ఉమా యాదవ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రైతు సంఘం, సీఐటీయూ నేతల ఫైర్
- చలో ఢిల్లీని విజయవంతం చేయాలని పిలుపు



ఇబ్రహీంపట్నం రూరల్: మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఇబ్రాహీంపట్నం రూరల్: ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీకి కార్మికులు, రైతులు తరలిరావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో జీపు జాతతో ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవన విధానం అస్తవ్యస్తంగా మారిందన్నారు. పెరిగిన ధరలకు సరిపడా వేతనాలు లేక కార్మికులు, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలు అమలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు, 6 లక్షల ప్రమాద భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సీఐటీయూ జిల్లా కోశాధికారి కవిత, కార్మిక నాయకులు మల్లేష్, సామెల్, ప్రకాష్ కారత్, జంగయ్య, రామకృష్ణారెడ్డి, ముసలయ్య, రాములు, తులిసిగారి నర్సింహ, శారద, విజయ్, జంగయ్య, చరణ్, రవి పలువురు పాల్గొన్నారు.

ధరలను నియంత్రించాలి..

తలకొండపల్లి: పెరగుతున్న నిత్యావసర ధరలను తక్షణమే నియంత్రించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూర్ జగన్ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా వారు జేపట్టిన జీపుజాత ఆదివాంర మండల కేంద్రానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జగన్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. కార్మికుల పట్ల కక్ష్యపూరిత విధానాలను ఆవలంబిస్తోందని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రవికుమార్, ప్రజాతంత్ర నాయకులు కురుమయ్య, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి రమేష్, పోచయ్య, పర్వతాలు, కళాజాత నాయకులు శేఖర్, అఖిల్, శ్రీనివాస్, ధనంజయ, సీఐటీయు నేతలు పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు స్పష్టం చేవారు. ఇందులో భాగంగా సీఐటీయూ, తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో జిల్లాలో జీపుజాత ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం నిర్వహించిన జీపుజాతలో రాజు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 8 ఏళ్ళుగా అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శివశంకర్, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: మాట్లాడుతున్న జగన్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్‌పై కాంగ్రెస్ నేతల నిరసన
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం



ఆమనగల్లు: మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కడ్తాల్: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లికేజీకి నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, నాయకులు నర్సింహ, వెంకటయ్య, మల్లేశ్‌గౌడ్, సత్యంయాదవ్, హీరాసింగ్, భానుకిరణ్, రాజేశ్, ఇమ్రాన్, రాజేందర్‌గౌడ్, విజయ్, ప్రవీణ్, రమేశ్, నరేశ్, మహేశ్ ఉన్నారు.

తలకొండపల్లి మండలంలో..

తలకొండపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. టీపీసీసీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం, ప్రభుత్వంలోని పెద్దలు కలిసి చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, బిక్యానాయక్, మాజీ ఎంపీటీసీ రాములు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ అజీం, అసెంబ్లీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చెన్నకేశవులు, ఇక్బాల్, పాషా, వెంకటేశ్, అఖిల్ బాబా, విష్ణు, కృష్ణయ్య, ఇమ్రాన్, ఆదిల్ పాల్గొన్నారు.

కేటీఆర్‌కు సంబంధం ఉంది..

తుర్కయంజాల్: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు సంబంధం ఉందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఆదివారం తుర్కయంజాల్‌లో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ మంగమ్మ, రాష్ట్ర నాయకులు శివకుమార్, నాయకులు అర్జున్, చిన్నయ్య పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ సర్కార్ చెలగాటమాడుతోందని టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ నిదర్శనమని యాచారం మండల కాంగ్రెస్ శ్రేణులు అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి నిరసనగా ఆదివారం యాచారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. అనంతరం బీఆర్‌ఎస్ సర్కార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, నాయకులు జగదీష్‌రావు, ముచ్చర్ల సంపత్ కుమార్, దూస రమేష్, విజయ్‌కుమార్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి..

ఇబ్రహీంపట్నం: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యుడు మంత్రి కేటీఆర్‌యేనని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూధన్‌రెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి నిరసనగా రాస్తారోకో నిర్వహించి మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు తరమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆందోళనచేస్తున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నాయకులు దాసు, ఆనంద్, శంకరయ్య, ప్రవీణ్‌కుమార్, రమేష్, బాలశివుడుగౌడ్, వీరేశ్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, నందకిషోర్, కరుణాకర్, కార్తీక్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలి..

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డును ప్రక్షాళన చేయాలని లేకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో తీవ్ర ఆందళోన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండ్లి రాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు బిచ్యానాయక్, వెంకటేశ్, కృష్ణనాయక్, రాఘవేందర్, అలీం, సురేశ్, అజీం, రాజశేఖర్, బాబా, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల మండలంలో..

ఇబ్రహీంపట్నం: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీల ఘటనపై మంచాల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంతో పాటు సిట్టింగ్ జడ్జితో లీకేజీ వ్యవహారంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేతలు రాంరెడ్డి, రాజు, బుగ్గరాములు, ఐలయ్య, ప్రేమకర్‌రెడ్డి, లింగంగౌడ్, కొమురయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభకు పదును



సోలార్ సిటీ మోడల్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎల్‌బీనగర్: పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయటం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతతోపాటు ప్రతిభకు పదును పెట్టినట్లు అవుతుందని హయత్‌నగర్ ఎంఈఓ హీర్యానాయక్ అన్నారు. ఆదివారం వనస్థలిపురంలోని అక్షర పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను అక్షర గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నిర్వాహకుడు వి.అశోక్‌రెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన మోడల్ పాఠశాల, నాగార్జున సాగర్ డ్యాం, సోలార్ సిటీ, అగ్ని పర్వతం నుంచి లావా ప్రవాహం, అయస్కాంత క్షేత్రంతో విద్యుత్ తయారీ, టర్బైన్ విద్యుత్ తయారీ, వీధి దీపాల టైమర్ వంటి ప్రదర్శనలు ఆహూతులనుఆలోచింప చేశాయి. ఇలాంటి ప్రదర్శనలతో విద్యార్థుల మేథస్సుకు పదును పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర పాఠశాలల ఇంచార్జిలు సాగర్‌బాయి, నాగలక్ష్మి, సత్యవాణి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.